క్లుప్తంగా

ముమ్మరంగా అభివృద్ధి పనులు

శావల్యాపురం: స్థానిక రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారిలో గల లింగాల వారి వీధిలో సీసీ డ్రెయిన్స్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నట్లు పంచాయతీరాజ్ ఏఈ కె.వెంకటేశ్వర స్వామి తెలిపారు. ఆయన శుక్రవారం వైఎస్సార్ సీపీ నేతలతో కలసి పనుల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో 170 మీటర్ల సీసీ డ్రెయిన్స్, సీసీ రోడ్డు నిర్మాణానికి ఉపాధి నిధులు రూ. 10 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. వీటితో ఇరువైపులా సీసీ డ్రెయిన్స్ నిర్మాణ పనులు పారదర్శకంగా జరుగుతున్నాయని, సీసీ రోడ్డును కూడా వారం రోజుల్లో ప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ సభ్యుడు దూదెకుల హుస్సేన్, వైఎస్సార్ సీపీ నాయకులు జవంగుల బాబు, కొండారెడ్డి, చిట్టేటి రవి, కొణతం ఏరుకలరెడ్డి, యాగసిరి ఏసు, ఈశ్వరయ్య, ముట్లూరి సత్యం, పొట్టిపాటి శ్రీను, వేముల శంకర్ పాల్గొన్నారు.

రోడ్డు కోత.. వాహనదారులకు వెత



నాదెండ్ల: మిచాంగ్ తుఫానుతో గ్రామాల్లో అంతర్గత రోడ్లు పలుచోట్ల ధ్వంసమయ్యాయి. గణపవరం నుంచి కావూరు లింగంగుంట్ల వెళ్లే మార్గంమధ్యలో యంపలబాబాయ్ చెరువు వద్ద వరద నీటికి రోడ్డు కోతకు గురైంది. సింగిల్ రోడ్డు కావడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. సగ భాగం రోడ్డు ధ్వంసం కావటంతో ప్రస్తుతం ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు మాత్రమే వెళ్లేందుకు వీలుంది. ట్రాక్టర్లు, లారీలు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. రాత్రి సమయాల్లో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కోతకు గురైన చోట మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



నరసరావుపేట టౌన్ : ఏరియా వైద్యశాల్లో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ అశోక్ కుమార్ శుక్రవారం తెలిపారు. ఏరియా వైద్యశాల ప్రాంగణంలోని బెంచ్‌పై గుర్తు తెలియని వ్యక్తి నిద్రిస్తూ ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన సిబ్బంది వైద్యశాల్లో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి ఆచూకీ తెలిసినవారు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ కోరారు.

రెండు గ్రామాల్లో వికసిత భారత్ సంకల్ప యాత్ర



యడ్లపాడు: మండలంలోని యడ్లపాడు, కారుచోల గ్రామాల్లో 'వికసిత భారత్' సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఎంపీడీవో వై. హనుమారెడ్డి ప్రజలకు వివరించారు. సర్పంచులు కె. హేమ, నారాయణమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వరూధిని, పీహెచ్‌సీ వైద్యులు ఎం. ప్రభాకరరావు, భరద్వాజ, సీహెచ్‌వో పున్నారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు, కార్యదర్శి శశికళ, వీఆర్వో చారి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వెంకటరమణ, సచివాలయ సిబ్బంది, యానిమేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కులగణనతో బీసీలందరికీ ప్రయోజనం



నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే కులగణనతో బీసీలందరికీ ప్రయోజనం కలుగుతుందని ఏపీ బొందిలి సేవా సంఘ రాష్ట్ర కార్య నిర్వాహణాధికారి బొందిలి శ్రీనివాససింగ్, ఏపీ వెనుకబడిన తరగతుల సేవా సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తుల వెంకటేష్ తెలిపారు. బీసీ కులగణనకు సహకరించాలంటూ ముద్రించిన కరపత్రాల్ని శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డితో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన కులగణనకు బీసీ సంఘీయులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కులగణనకు వచ్చే వారికి సంఘ అధ్యక్షుల నుంచి సర్టిఫికెట్ తీసుకొని అధికారికి ఇవ్వాలని సూచించారు. కులగణన నిర్ణయం తీసుకున్న సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి అభినందనలు తెలిపారు.

పంట నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- అధికారులతో కలసి పంట పొలాల పరిశీలన



పమిడిమర్రులో నేలకొరిగిన వరి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: తుఫాన్ కారణంగా నష్టపోయిన ప్రతి రైతుకూ నష్టపరిహారం అందేవిధంగా పంటనష్టం అంచనాను రూపొందించాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని పమిడిమర్రు, కొండకావూరు, గురవాయపాలెం, ఉప్పలపాడు, దొండపాడు గ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి పర్యటించారు. తుఫాన్‌తో దెబ్బతిన్న పంట పొలాల్ని అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. పమిడిమర్రులో వరద ఉద్ధృతికి పంట పొలాలతో పాటు శ్మశానానికి వెళ్లే రోడ్డు కొట్టుకుపోయినట్టు గ్రామస్తులు తెలిపారు. దీని వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. శాశ్వత ప్రాతిపదికన నిర్మాణం జరపాలని కోరారు. అధిక వర్షానికి ఉరకెత్తి ఎండిపోయిన రైతు జొన్నలగడ్డ చిన్నమ్మాయి మిరప పంటను పరిశీలించారు. నేల కొరిగిన వరి పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. కొండకావూరులో ఈదురుగాలులకు నేలకొరిగిన అరటి, దొండపాడులో దెబ్బతిన్న శనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ తుఫాన్ కారణంగా నియోజకవర్గంలోని రెండు మండలాల్లో దాదాపు 11వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని తెలిపారు. ఈనెల 9వ తేదీ నుంచి పంట నష్టం అంచనాను వ్యవసాయ అధికారులు చేపడుతున్నారని చెప్పారు. నియోజకవర్గంలో సాగుచేసిన శనగ పూర్తిగా దెబ్బతిన్నదని పేర్కొన్నారు. అరటి 167 ఎకరాల్లో నేలకొరిగిందని, ఎకరానికి రూ.3లక్షలు నష్టం రైతుకు వచ్చిందని వివరించారు. అరటికి ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ హెక్టారుకు రూ.25వేలు ఇస్తుందని తెలిపారు. మిరప పంట ఉరకెత్తడంతో పాటు వాలిపోయిందని తెలిపారు. 33శాతం కన్నా అధికంగా దెబ్బతిన్న పంటల్ని గుర్తించి నమోదు చేయాలని వ్యవసాయ సిబ్బందికి సూచించారు. చెరువులు, బావులు, బోర్ల కింద సాగుచేసిన వరి పంట చేతికొచ్చే దశలో నేలకొరిగిందని పేర్కొన్నారు. అన్ని పంటలు కూడా దెబ్బతిని రైతులు కష్టాల్లో ఉన్నారని, సానుభూతితో వ్యవహరించి ఆదుకోవాల్సిన అవసరం సిబ్బందిపై ఉందని తెలిపారు. నిబంధనల పేరుతో ఇబ్బందులకు గురిచేయవద్దని సూచించారు. రబీలో సాగు చేసిన పంటల ఈ-క్రాప్ నమోదు కాలేదని, దాని ప్రస్తావన లేకుండా పంట నష్టాన్ని నమోదు చేయాలని కోరారు. నష్టం జరిగిన పంట పొలాల్ని పరిశీలించి, పార్టీలకతీతంగా రైతుల పేర్లను నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి, ఏడీఏ మస్తానమ్మ, డాట్ సెంటర్ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ రమేష్, జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు, ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, సర్పంచులు దాసరి శ్రీనివాసరావు, జెక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మోపూరి పిచ్చయ్య, మాజీ సర్పంచ్ వెన్నపూస నాగిరెడ్డి, కోటప్పకొండ ట్రస్ట్ బోర్డు సభ్యుడు మట్లా లింగారెడ్డి, జాగర్లమూడి వసంతరావు, ఎంపీటీసీ సేతు పాల్గొన్నారు.

రొంపిచర్లలో సందడిగా సెమీ క్రిస్మస్ వేడుకలు



చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి

రొంపిచర్ల: క్రీస్తు చూపిన శాంతి మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రొంపిచర్లలో మండల పాస్టర్ ఫెలో షిప్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రీస్తు బోధనలు మానవాళికి అనుసరణీయమని తెలిపారు. శాంతి, సంతోషాలకు చిహ్నం క్రిస్మస్ అన్నారు. క్రీస్తు జననం లోకానికి వెలుగులు నింపిందని చెప్పారు. ఏసుక్రీస్తు ఎప్పుడూ ప్రేమను, కరుణను, క్షమాగుణాన్ని కలిగి ఉండాలని బోధనలు చేశారని తెలిపారు. ఈ సందర్భంగా సెమీ క్రిస్మస్ కేక్ కట్ చేసి ముందస్తు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు పడాల సాంబశివారెడ్డి, పచ్చవ రవీంద్రబాబు, కాల్వ రవి, మల్లెల అశోక్, గాబ్రియల్, గుండాల వెంకటేష్, పాలపర్తి వెంకటేశ్వర్లు, పాస్టర్లు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే అంగన్‌వాడీల అభివృద్ధి



శిక్షణ శిబిరంలో కమిటీ సభ్యులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

యడ్లపాడు: అంగన్‌వాడీ కేంద్రాల సర్వతోముఖాభివృద్ధికి అభివృద్ధి కమిటీలు సమన్వయంతో పనిచేయాలని పంచాయతీరాజ్ డీఈఈ శ్రీనివాస్ చెప్పారు. అంగన్‌వాడీ నాడు-నేడు ఫేజ్- 2బీ అభివృద్ధి కమిటీల శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం యడ్లపాడు పీఆర్ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ ప్రతి కేంద్రంలోనూ తాగునీరు, మరుగుదొడ్డి, విద్యుత్, గోడలపై ఆకర్షణీయమైన చిత్రాల్ని ఏర్పాటు చేయాల్సిన బాధ్యత కమిటీలదేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సొలస, యడ్లపాడు సెక్టార్ల ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎం. జోజమ్మ, కె. వెంకటరమణ, అంగన్‌వాడీ తల్లుల కమిటీ సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పంట పొలాల్లో సస్యరక్షణ చేపట్టాలి



మిరప పంటను పరిశీలిస్తున్న డాట్ సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ వరప్రసాద్


నరసరావుపేట రూరల్: అధిక వర్షాలకు రైతులు పంట పొలాల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా డాట్ సెంటర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్. వరప్రసాద్ తెలిపారు. భారీ వర్షాల అనంతరం పంటల్లో తీసుకోవాల్సి సస్యరక్షణ చర్యలపై మండలంలోని పమిడిపాడులో శుక్రవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలో సాగుచేసిన మిరప, మినుము, శనగ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ మిరప పంట ప్రస్తుతం పూత, కాయ దశలో ఉందని, వర్షాల అనంతరం వేరుకుళ్లు, కొమ్మ ఎండు తెగులు ఆశించే అవకాశం ఉందని తెలిపారు. నివారణకు కార్బండిజం 20గ్రాములు లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటితో కలిపి మొక్కల మొదలు తడిచే విధంగా పిచికారీ చేయాలని సూచించారు. మినుములో ఇనుప ధాతు నివారణకు అన్నభేది 5 గ్రాములు, నిమ్మ ఉప్పు ఒక గ్రాము లీటరు నీటితో కలిపి వారంలో రెండుసార్లు పిచికారీ చేయాలని చెప్పారు.

యడ్లపాడులో..

వర్షాలకు దెబ్బతిన్న మొక్కల సస్యరక్షణ చర్యలు సత్వరమే చేపట్టాలని ఏవో సీహెచ్. సరిత చెప్పారు. మండలంలోని కారుచోల, గుత్తావారిపాలెం గ్రామాల్ని సిబ్బందితో కలసి ఏవో సందర్శించారు. తుఫాన్ కారణంగా నీట మునిగిన మిరప, పొగాకు, శనగ తదితర పంటల్ని పరిశీలించారు. మొక్కల వేరు వ్యవస్థ కుళ్లిపోకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అధిక వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటల్ని కాపాడుకునేందుకు సస్యరక్షణ చర్యలుగా పైపాటుగా యూరియా, పొటాష్, వేపపిండిని పిచికారీ చేయాలని సూచించారు. వీటి వల్ల తేమ శాతం తగ్గి, తెగుళ్ల సమస్య ఉండదని తెలిపారు. భూమి నుంచి మొక్కలు పోషకాలు తీసుకునే దశలో ఉండవు కనుక ఆకుల ద్వారానే పోషకాలు అందుకుంటాయి కాబట్టి పైపాటుగానే 19.19.19, లేదా ఫార్ములా -4 వంటి సూక్ష్మ పోషకాల్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, ఆర్‌బీకేల సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు నమోదులో లోపాలుంటే సరిదిద్దండి

చిలకలూరిపేట నియోజకవర్గ ఎన్నికల అధికారి జి. వసంతబాబు



సమీక్ష చేస్తున్న వసంతబాబు, పక్కన తహసీల్దార్ కుటుంబరావు

యడ్లపాడు: ఓటరు నమోదులో లోపాలుంటే తక్షణమే సరిదిద్దుకోవాలని చిలకలూరిపేట నియోజకవర్గ ఎన్నికల అధికారి జి. వసంతబాబు అధికారుల్ని ఆదేశించారు. ఆయన శుక్రవారం యడ్లపాడు తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. తహసీల్దార్ వై.వి.బి.కుటుంబరావుతో కలసి బీఎల్‌వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరు 2,3 తేదీల్లో నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు క్యాంపుల్లో వచ్చిన దరఖాస్తుల్ని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని తెలిపారు. కచ్చితమైన ఓటర్ల జాబితా రూపకల్పన లక్ష్యంతో బూత్‌లెవల్ అధికారులు పనిచేయాలని సూచించారు. యువ ఓటర్ల చేరిక, డెత్ ఓటర్ల తొలగింపు తదితర అంశాలపై బీఎల్‌వోలతో సమీక్షించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదు, విజ్ఞప్తికీ పరిష్కారం చూపిస్తున్నట్లు వెల్లడించారు. ఓట్ల చేరిక, తొలగింపు, సవరణకు సంబంధించి వచ్చే అన్ని అర్జీలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేస్తున్నామని తెలిపారు. డబల్ ఎంట్రీ, మృతుల ఓట్లు పూర్తిగా తొలగించామని, అవాస్తమైన ఆరోపణల్ని నమ్మవద్దని చెప్పారు.

అవకతవకలులేని ఓటరు జాబితా బీఎల్‌వోల బాధ్యత

నరసరావుపేట: అవకతవకలులేని ఓటరు జాబితా బూత్‌లెవల్ అధికారుల(బీఎల్‌వో) బాధ్యతని నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీవో ఎం.శేషిరెడ్డి తెలిపారు. అవతవకలకు పాల్పడితే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్సిపల్ బంగ్లాలోని కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. డబుల్‌ఎంట్రీలు, చనిపోయిన ఓటర్ల విచారణ గురించి ఆయన తెలియజేశారు. డివిజనల్ పరిపాలన అధికారి చంద్రారెడ్డి ఫారం-6, అర్జీల విచారణ, నోటీసుల గురించి వివరించారు. కార్యక్రమంలో సహాయ ఎన్నికల అధికారి, మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్ పాల్గొన్నారు.

రేపు రెడ్డి సంఘీయుల కార్తిక వనసమారాధన

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ శ్రీ యోగి వేమారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ రెడ్ల సత్రంలో 10న ఆదివారం రెడ్డి సంఘీయులు కార్తిక వనసమారాధన నిర్వహిస్తున్నట్టు సత్రం కమిటీ అధ్యక్షుడు కామిరెడ్డి నర్సిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెడ్డి సంఘీయులు కుటుంబసమేతంగా హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. మధ్యాహ్నం 2గంటల నుంచి రెడ్డి వివాహ పరిచయ కార్యక్రమం ఉంటుందని, ఆసక్తి గల వారు బయోడేటాతో రావాలని ఆయన తెలియజేశారు.

దివ్యాంగులకు ట్యాబ్‌ల పంపిణీ

రొంపిచర్ల: స్థానిక భవిత కేంద్రంలో శుక్రవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈవో బ్రహ్మేశ్వరరావు హాజరయ్యారు. సమగ్ర శిక్షణ ద్వారా దివ్యాంగులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల్ని ఆయన వివరించారు. శిక్షణ పొందిన చెవిటి, మూగ పిల్లలకు రూ.50 వేల విలువ చేసే ట్యాబ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం సుభాని, ఒకుశాదేవి, శ్రీనివాసరావు, ఎన్. నాగరాజు, ఐఈఆర్ టీచర్ సురేష్ కుమార్, డి. నిర్మల పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిలకలూరిపేట: విద్యుత్ సబ్ స్టేషన్ల మరమ్మతుల దృష్ట్యా పట్టణం, మండలంలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ ఆర్. అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని గుర్రాల చావిడి, పోలీస్‌స్టేషన్ రోడ్డు, తూర్పు మాలపల్లె, సూదావారిపాలెం, మద్దినగర్, ప్రభుత్వాసుపత్రి రోడ్డులో సరఫరా ఉండదని పేర్కొన్నారు. మండలంలోని బొప్పూడి, పసుమర్రు, మద్దిరాల సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో సంబంధిత వేళల్లో సరఫరా ఉండదని తెలియజేశారు. వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

బొల్లాపల్లి: మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా పునరుద్ధరించినట్లు ఆ శాఖ రేమిడిచర్ల సెక్షన్ ఏఈ వి. వెంకట్రావు శుక్రవారం తెలిపారు. మండలంలోని బొల్లాపల్లి, రేమిడిచర్ల సెక్షన్ల పరిధిలో రూ. 2లక్షల విలువైన నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు, 14 స్తంభాలతో పాటు ఇతర పరికరాలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. వ్యవసాయ, గృహ అవసరాల నిమిత్తం మండలంలోని రెండు సెక్షన్ల పరిధిలో కరెంటును పూర్తిస్థాయిలో సరఫరా చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

రేపు వర్సిటీ అంతర్ కళాశాలల ఖోఖో పోటీలు

నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల పురుషుల ఖోఖో పోటీల్ని ఈనెల 10, 11తేదీల్లో విక్టరీ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ పి.వేణుగోపాల్, వ్యాయామ అధ్యాపకుడు ఎస్.కృష్ణంరాజు శుక్రవారం తెలిపారు. పోటీలతో పాటు వర్సిటీ టీమ్‌ను ఎంపిక చేయనున్నట్టు వివరించారు. క్రీడాకారులు తమ 10వ తరగతి, ఇంటర్మీడియేట్ సర్టిఫికెట్, కళాశాల గుర్తింపు కార్డుతో హాజరుకావాలని తెలిపారు. పోటీలో పాల్గొనే కళాశాల జట్లు వివరాలను 8886865700, 9392706070 నంబర్లకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

పంచాయతీల పాలన విధానంపై శిక్షణ

బొల్లాపల్లి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్స్‌కు శుక్రవారం ఒక రోజు శిక్షణ ఇచ్చారు. పంచాయతీ పాలన విధానాలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల విధులు, సమావేశాల నిర్వహణ, గ్రామసభల్లో పాటించాల్సిన నియమ నిబంధనలు, పనితీరు గురించి వివరించారు. పంచాయతీలు సొంత ఆదాయ వనరులు సమకూర్చుకోవడంపై ప్రత్యేకంగా వివరించారు. శిక్షకులుగా ఎ.వి.పాండురంగారావు, డి. శ్యామలాదేవి వ్యవహరించారు.

వైభవంగా కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం

శావల్యాపురం: మండల కేంద్రమైన శావల్యాపురంలో గల శ్రీకనకదుర్గమ్మ ఆలయ 22వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు రావిపాటి సాయి భరత్ సారథ్యంలో ఉత్సవ విగ్రహాల్ని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. దంపతులతో విశేష పూజలు చేయించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రెడ్డి జ్వాలా నరసింహారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యన్న తాతా ఉరుసు వేడుకలు

శావల్యాపురం: అయ్యన్న తాతా ఉరుసు వేడుకల్ని శుక్రవారం శావల్యాపురంలో ఘనంగా నిర్వహించారు.గత 200 సంవత్సరాల నుంచి పురిమెట్ల వంశీయుకుల సారథ్యంలో వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా అయ్యన్న తాతా మఠాన్ని భక్తులు సందర్శించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, తమ మొక్కులు తీర్చుకున్నారు. ఉరుసు వేడుకలు సందర్భంగా మఠాన్ని విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు.

వైభవంగా చెన్నకేశవస్వామి ఆలయ భూమిపూజ

పాల్గొన్న మంత్రి విడదల రజిని



భూమిపూజలో పాల్గొన్న మంత్రి రజని, నాయకులు

నాదెండ్ల: నాదెండ్ల మండలం తూబాడులో శ్రీ భూ, నీళా సమేత శ్రీ చెన్నకేశవస్వామి, శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానాల జీర్ణోద్ధరణ పనులకు శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని భూమిపూజ చేశారు. 250 ఏళ్ల నాటి చరిత్ర కలిగిన ఈ ఆలయం ఇటీవల మరమ్మతులకు గురైంది. ఆలయ పరిస్థితిని గ్రామస్తులు మంత్రి దృష్టికి తీసుకురావడంతో దేవదాయ శాఖ నుంచి నిధులు మంజూరు చేయించిన సంగతి తెలిసిందే. గ్రామస్తుల భాగస్వామ్యం రూ.23 లక్షలు కాగా, మిగిలిన రూ.77 లక్షలు దేవదాయశాఖ మంజూరు చేసింది. నవంబర్ 27, 28, 29 తేదీల్లో పత్తిపాడుకు చెందిన బృందావనం ఆదిత్యనరసింహాచార్యుల బృందం ఆధ్వర్యంలో శాంతి హోమాలతో పాటు ఆలయ కళాప్రకర్షణ పనులు పూర్తయ్యాయి. ఉత్సవ విగ్రహాల్ని బాలాలయంలో ప్రతిష్ఠించారు. ఆలయ పూజారి రామకృష్ణమాచార్యుల బృందం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 7.56 గంటలకు భూమిపూజ వైభవంగా జరిగింది. కార్యక్రమంలో దేవదాయశాఖ ఈవో తులసిరెడ్డి, సిబ్బంది త్రిపురరెడ్డి, సర్పంచ్ గోళ్లమూడి కాశయ్య, ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ సభ్యుడు మస్తాన్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు గొంటు శ్రీనివాసరెడ్డి, విడదల గోపీ, మాజీ సర్పంచ్ ఉషోదయ స్వప్నమేరి, ఆలయ కమిటీ సభ్యులు సుబ్బారావు, రఘురాం, మార్కెట్ యార్డు చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాలకు ప్రభుత్వం అండ

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



లబ్ధిదారులకు వాహనాలను అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): అణగారిన వర్గాలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సహకార ఆర్థిక సంస్థ సహకారంతో 'స్వచ్ఛత ఉద్యమి యోజన' ద్వారా 50శాతం రాయితీపై ప్రభుత్వం ద్వారా అందిస్తున్న మరుగుశుద్ధి వాహనాల్ని లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి షెడ్యూల్డ్ కులాల ఆర్థిక సంస్థ ద్వారా 'స్వచ్ఛత ఉద్యమి యోజన' కింద రాయితీపై వాహనాల్ని అందించి వారి ఆర్థికాభివృద్ధికి దోహదపడుతున్నారని తెలిపారు. పేద ప్రజలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని చెప్పారు. గత ప్రభుత్వంలో అణగారిన వర్గాల్ని హేళన చేసే విధంగా మాట్లాడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నోటి నుంచి ఎస్సీలలో ఎవరైనా పుట్టాలని అనుకుంటారా ? అని కూడా వచ్చిందని గుర్తు చేశారు. మరికొంత మంది నాయకులు కూడా నీచంగా మాట్లాడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని తెలిపారు. ఇక్కడ తనపై పోటీ చేయడానికి భయపడుతూ మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఎల్లో మీడియా ద్వారా అసత్యప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నివేదిక రూపకల్పనలో పారదర్శకత అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో రామారావు

ఈపూరు: వర్షాలకు పంట నష్టపోయిన రైతుల పొలాలకు వెళ్లి చూసిన తరువాతే నివేదిక పారదర్శకంగా తయారు చేసి ప్రభుత్వానికి పంపించాలని తహసీల్దార్ సుధాకర్ తెలిపారు. మిచాంగ్ తుఫాన్ వల్ల నష్టపోయిన పంటల గురించి నివేదిక తయారు చేయడంపై స్థానిక మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, రెవెన్యూ సిబ్బందికి శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుధాకర్ మాట్లాడుతూ సిబ్బంది అంతా టీంగా ఏర్పడి నష్టపోయిన పంటల వివరాల్ని సేకరించాలని సూచించారు. మండలంలో వరి 385 హెక్టార్లు, మినుము 15 హెక్టార్లు, మొక్కజొన్న 198 హెక్టార్లు, పొగాకు 10 హెక్టార్లు, జొన్న 20 హెక్టార్లు, శనగ 847 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా వేశామని, ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు తెలిపారు. ఏవో రామారావు మాట్లాడుతూ పడిపోయిన వరిని నిలబెట్టుకుని, బూస్టర్ డోస్‌లా యూరియా పిచికారీ చేసుకోవాలని సూచించారు. మొలక రాకుండా ఐదు శాతం ఉప్పు ద్రావణం, తెగుళ్లు, బూజు రాకుండా ప్రొపికోనాజోల్ ఒక మిల్లీలీటర్ జల్లు కోవాలని సూచించారు. పొలాల్లో వర్షపునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని చెప్పారు. రైతులకు ఆర్‌బీకే సిబ్బంది అందుబాటులో ఉండి అవసరమైన సూచనలు, సస్యరక్షణ చర్యలు తెలియజేయాలని ఆదేశించారు.